నడక మార్గం.. సుగమం

నాడు

గతంలో నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొండవాలు అభివృద్ధిని, ప్రజల గోడును పూర్తిగా గాలికొదిలేశారు. భారీ వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడి అనేక ఘోర ప్రమాదాలు జరిగినా.. నాటి పాలకులకు పట్టలేదు. ఇక మెట్ల మార్గాలు, రహదారులు, కాలువల పరిస్థితి ఘోరంగా ఉండటంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు మంచిరోజుల కోసం ఎదురుచూసే వారు.

నేడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతో ఉత్తర నియోజవకర్గంలోని కొండవాలు ప్రాంతాలకు మహర్దశ పట్టింది. ముఖ్యంగా కొండవాలు ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చక్కనైనా సీసీ రోడ్లు, మెట్ల మార్గాలు, రక్షణగా రెయిలింగ్ నిర్మించారు. జీవీఎంసీ పరిధిలోని కొండవాలు ప్రాంతాల అభివృద్ధితో వార్డులు స్మార్ట్‌గా మారుతున్నాయి.

- కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలకు మోక్షం
- అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ
- మెట్ల దారులు – రెయిలింగ్ నిర్మాణం
- అభివృద్ధి పనులపై కొండవాలు ప్రజల హర్షం

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డులో కొండవాలు ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం పరిధిలోని కొండవాలులో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. ముఖ్యంగా ఇక్కడి నడక మార్గాలు అధ్వానంగా ఉండటంతో మౌలిక వసతుల కల్పనకు కష్టతరంగా మారింది. ఎన్నో ఏళ్లుగా వృద్ధులు, పిల్లలు, నివాసులు శిథిలావస్థ మెట్ల మార్గాల్లో నడిచేందుకు నానా ఇబ్బందులు పడేవారు. గత టీడీపీ ప్రభుత్వం వీరి సమస్యలను పట్టించుకునేది కాదు.

రూ.2.04 కోట్లతో పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి మోక్షం లభించింది. 46వ వార్డులోని శాంతినగర్, సూరిబాబునగర్, మధుసూదన్ నగర్, కైలాసపురం, సంతోషనగర్, సూరిబాబునగర్, దుర్గాకైలాసనగర్, లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్–1, 2, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో గత రెండేళ్లలోనే సుమారు రూ.2.04 కోట్ల వ్యయంతో మెట్ల మార్గాలను ఆధునికీకరించారు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ కటుమూరి సతీష్ కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేయించారు.

వీరి కృషితో..

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వార్డు కార్పొరేటర్ కటుమూరి సతీష్‌ల కృషితో కొండవాలు ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. సీసీ రోడ్లు, రక్షణ గోడలు, మెట్ల మార్గాలు–రెయిలింగ్ నిర్మాణాలు, మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.2.04 కోట్లతో చేపట్టిన మెట్ల మార్గాలు, రెయిలింగ్ నిర్మాణాలు ఇప్పటికే పూర్తికాగా.. మరో రూ.80 లక్షల పనులు జరుగుతున్నాయని జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. గత టీడీపీ హయాంలో జరగని కొండవాలు ప్రాంతాల అభివృద్ధి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతుండటంతో నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




46వ వార్డు కస్తూరినగర్‌లో ఆధునికీకరించిన మెట్ల మార్గం


మధుసూదన్ నగర్‌లో మెట్ల మార్గం

జీవీఎంసీ వార్డు నంబర్	: 46
కొండవాలు ప్రాంతాలు	: సుమారు 14
మెట్ల మార్గాల నిర్మాణ నిధులు :	రూ.2.04 కోట్లు
ప్రస్తుతం జరుగుతున్న పనుల వ్యయం :	రూ.80 లక్షలు


శాంతినగర్‌లో నిర్మించిన మెట్ల మార్గం, రెయిలింగ్


సంజీవయ్య కాలనీలో శుభ్రంగా మెట్ల దారి

46వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు-రెయిలింగ్ పనుల వివరాలు

కొండవాలు ప్రాంతాలు	నిధులు
మధుసూదన్ నగర్, కస్తూరినగర్	రూ.29.50 లక్షలు
శాంతినగర్-1, 2	రూ.18 లక్షలు
సంజీవయ్య కాలనీ-1, 2, దుర్గాకైలాసనగర్	రూ.26.20 లక్షలు
మధుసూదన్ నగర్-1	రూ.32 లక్షలు
సూరిబాబునగర్	రూ.29 లక్షలు
సూరిబాబునగర్-1, 2	రూ.22 లక్షలు
లక్ష్మీనారాయణపురం	రూ.23.50 లక్షలు
శాంతినగర్, కస్తూరినగర్-1	రూ.19 లక్షలు

నడక ఇబ్బందులు తొలగాయి



కొండవాలులో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాం. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి జాడ ఏనాడు కనిపించలేదు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. నేడు కొండవాలు మెట్ల మార్గాల్లో ఇబ్బందులు లేకుండా నడుస్తున్నాం.

– కోవగాపు లావణ్య, దుర్గాకైలాసనగర్

మెట్ల మార్గాలు బాగున్నాయి



కొండవాలు ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కృషి చేయడంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ప్రభుత్వ నిధులతో మెట్ల మార్గాలకు మోక్షం లభించింది. స్మార్ట్ వార్డ్‌గా మెట్ల మార్గాలను అభివృద్ధి చేస్తున్నారు.

– కొరువాడ చిన్నా, కస్తూరినగర్

అద్దంలా మెరుస్తున్నాయి



మా కొండవాలు ప్రాంతంలోని మెట్ల మార్గాలు రాళ్లు తేలి శిథిలావస్థలో ఉండేవి. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన నాటి నుంచి ఇబ్బందులు తొలగుతున్నారు. కొత్తగా నిర్మించిన మెట్ల మార్గాలు అద్దంలా మెరుస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ హామీలన్నీ నెరువేరుస్తున్నారు.

– కె.చిన్ని, శాంతినగర్

క్లుప్తంగా

మానసిక ఆందోళన వద్దు


మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణేంద్రబాబు

సీతంపేట: హెచ్ఐవీ, ఎయిడ్స్ వల్ల ఎవరూ చనిపోరని, పౌష్టికాహార లోపం, మానసిక ఆందోళన వల్ల కలిగే సెకండరీ ఇన్ఫెక్షన్ల వల్ల చనిపోతారని డిస్ట్రిక్ట్ లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిత్యా బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పీపుల్ లివింగ్ విత్ హెచ్ఐవీలకు మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం, ఆత్మస్థైర్యంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిర్రా విశాలాక్షి, కోశాధికారి డాక్టర్ డి.దీనబంధు, స్టేట్ కో ఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మురళీనగర్ స్విమ్మర్ల సత్తా


స్విమ్మర్లను సత్కరిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన బాలబాలికలను శనివారం పార్కు నిర్వహణ సంఘం ఘనంగా సత్కరించింది. ఇక్కడి స్విమ్మర్లు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు కన్సొలేషన్ బహుమతులు పొందారు. వీరిని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది జె.పృథ్వీరాజ్, మళ్ల రామకృష్ణ, పి.కనకరాజు, ఎంవీ రెడ్డి, బీటీ స్వామి పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో హెల్త్‌టాక్ రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు హెల్త్ టాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూరో ఆంకాలజీ, లాప్రోస్కోపిక్‌కు చెందిన ప్రముఖ మూత్ర సంబంధిత, కిడ్నీ వ్యాధుల నిపుణుడు డాక్టర్ జి.రవీంద్రవర్మ, కిడ్నీ మార్పిడి నిపుణుడు డాక్టర్ అమిత్ సప్లే పాల్గొంటారన్నారు. 45 ఏళ్లు దాటిన పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ వ్యాధి, కిడ్నీ, మూత్ర సంబంధిత సమస్యలు, మహిళల్లో కిడ్నీల్లో రాళ్లు, వాటి నివారణ మార్గాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకుని తగిన సలహాలు పొందవచ్చన్నారు.

ధనుర్మాసోత్సవాలకు సిద్ధం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్ సమీపంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు గోపాలాచార్యులు తెలిపారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, గంటపూజ, అర్చన, తిరుప్పావై, పాశుర విన్నపాలతో ధనుస్సంక్రమణం ప్రారంభమవుతుందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన


బాబా విగ్రహం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతమ్మధార: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీసాయి విగ్రహం వద్ద భక్తులు ఓం, త్రిశూలం, స్వస్తిక్ ఆకారంతో దీపాలు వెలిగించారు. బాబా సన్నిధిని 1008 దీపాలతో అలంకరించారు. ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతే ప్రధాని లక్ష్యం


దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

సీతంపేట: దివ్యాంగుల అభ్యున్నతే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అలీమ్ కో, జీవీఎల్, జిల్లా యంత్రాంగం సమన్వయంతో శనివారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం దరఖాస్తుల స్వీకరణ, గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ ఏడాది ముగింపు లోపు దేశంలోని దివ్యాంగులను గుర్తించి 30 లక్షల మందికి ఉపకరణాలు అందజేయనున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్రీయ వయోజన పథకం నిమిత్తం 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి కావాల్సిన సామగ్రి కూడా అందిస్తామన్నారు. సుమారు 700 మంది దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీ కె.పద్మావతి, స్థానిక నాయకులు సురేష్, శంకరరావు, విజయలక్ష్మి, సుజాత, ప్రసాదరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు


బాపూజీనగర్ యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం కోసం ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బాపూజీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) శనివారం ఆయన సందర్శించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు నూరు శాతం అయ్యేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఇతర ప్రాంతాల సందర్శనకు వెళ్లిన సమయంలో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. బర్త్ ప్లానింగ్, హై రిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి గర్భిణికి టీటీ ఇంజెక్షన్ ఇవ్వాలని, 12 వారాల లోపు ప్రతి గర్భిణి పేరు నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోరుగా ఓటర్ల నమోదు


మాధవధార పాఠశాలలో ఓటర్ల సవరణను పరిశీలిస్తున్న ఏఈఆర్‌వో సత్యనారాయణ

మద్దిపాలెం: జీవీఎంసీ 50, 51, 53 వార్డుల్లో ఓటరు నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ నేతృత్వంలో వార్డు కార్యాలయంలో ఓటరు నమోదు ప్రక్రియ శనివారం ఏర్పాటు చేశారు. వార్డుకు సంబంధించి ఎవరైనా ఓటు ఉందో లేదో చూసుకుని, ఓటు నమోదు, సవరణలు వంటివి ఉంటే చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఆధార్ కార్డు, చిరునామా ప్రూఫ్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తెచ్చుకోవాలన్నారు. వార్డు నాయకులు ఏవీఎస్ రాజు, సనపల నారాయణస్వామి పాల్గొన్నారు.

51వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు వార్డు కార్యాలయంలో పార్టీ నాయకులు ఓటరు నమోదు చేపట్టారు. ఓటర్లు తమ ఓట్ల లిస్టును సరిచూసుకోవచ్చని, అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చని సూచించారు.

53వ వార్డులో..

11, 12, 13, 14 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద హైవే పక్కనున్న అంబేడ్కర్ భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు పలువురు ఓటరు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు సవరణ, మార్పులు,చేర్పులుతోపాటు కొత్త ఓటర్లను నమోదు చేశారు. పార్టీ నాయకులు షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఫారాల స్వీకరణ

మురళీనగర్: ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జోరుగా సాగుతోంది. మురళీనగర్ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీ, మాధవధార జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల సవరణ కేంద్రాల్లో ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణకు సంబంధించి ఫారాలను బీఎల్‌వోలు తీసుకున్నారు. 49, 50 వార్డులకు సంబంధించి 32 ఫారం–6 (నమోదు), 19 ఫారం–7 (తొలగింపులు), 15 ఫారం–8లు (మార్పులు) వచ్చాయి. 50వ వార్డు పార్టు, 51వ వార్డుకు సంబంధించి 45 ఫారం–6, 2 ఫారం–6ఏ, 23 ఫారం–7, 32 ఫారం–8లు వచ్చినట్లు సూపర్‌వైజర్ జి.రాజేష్ చెప్పారు. ఏఈ ఆర్‌వో సిహెచ్.సత్యనారాయణ ఓటర్ల సవరణ కేంద్రాలను పరిశీలించారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో విశేష పూజలు


దీపారాధన చేస్తున్న మహిళలు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి, స్వామికి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మహిళలు దీపారధన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థి అదృశ్యం


పూర్ణచందు

మద్దిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యంపై ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కైలాసపురం శాంతినగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పూర్ణచందు కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన సదరు బాలుడు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికినా ప్రయోజనం లేకపోయింది. గతంలో కూడా పూర్ణచందు సరిగ్గా చదవలేదని తల్లిదండ్రులు మందలించడంతో రెండు సార్లు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి వచ్చేసేవాడని తల్లింద్రులు తెలిపారు. ఈ సారి ఇంకా రాకపోవడంతో తండ్రి పద్మనాభస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్ నగదు అందిస్తున్న కన్వీనర్ భోగలింగేశ్వరరావు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో శనివారం పింఛన్ల పంపిణీ చురుగ్గా జరిగింది. 110 సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్ భోగ లింగేశ్వరరావు వేకువజాము 5 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. 14వ వార్డులో 775 పెన్షన్లకు గానూ 690 మందికి పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

‘ఉత్తర’ అభివృద్ధి పనులపై సమీక్ష


ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ అభివృద్ధి పనులపై శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జీవీఎంసీ జోన్–3, 5ల ఇంజినీరింగ్ అధికారులతో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష నిర్వహించారు. రహదారుల విస్తరణ పనులు, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రైనేజీల పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంతోపాటు విశాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఎస్ఈలు వేణుగోపాల్, సత్యనారాయణరాజు, జోన్–3 టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునందరావు, ఈఈలు రత్నాకర్‌రెడ్డి, మచ్చిరాజు, ఏఈలు రత్నాకర్, రమణమ్మ, శ్రీనివాసరావు, అర్చన, ఉమామహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టోఫెల్ పరీక్షలు


టోఫెల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



స్క్రీన్‌పై ఆడియో ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆంగ్ల భాషకు సంబంధించి టోఫెల్ పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శిరిపురపు పెద్దినాయుడు పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా జరిగాయి. స్మార్ట్ టీవీలో టోఫెల్ పరీక్షలో భాగంగా ఉచ్చారణకు సంబంధించిన పదాలు, వాక్యాల ఆడియోను ప్రదర్శించారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులు వారికిచ్చిన పేపర్‌లోని పదాలను నింపారు. ఇందులో కీలకమైన టోఫెల్‌లో ఫారిన్ లాంగ్వేజీ ఆంగ్ల భాషా ఉచ్చారణను విద్యార్థులు గ్రహించి పదాలు, వాక్యాలను గుర్తించారు. 200 మంది 3, 4, 5 తరగతుల విద్యార్థులు అత్యంత శ్రద్ధతో ఈ పరీక్ష రాయడం గమనార్హం.

నక్షత్ర వనంలో వన సమారాధన


వనభోజనాలు చేస్తున్న ట్రస్టీ సభ్యులు, భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలోని నక్షత్ర వనంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం వన భోజనాలు నిర్వహించారు. భక్తులు, ట్రస్టీ సభ్యులు, కోలాటం సభ్యులు పాల్గొని భోజనాలు చేశారు. అనంతరం భక్తులు బిల్వాష్టకం, శివుడికి అష్టోత్తరాలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ శ్రీనివాసరాజు, ప్రధాన అర్చకుడు డి.రాజాస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల్లో చైతన్యానికి కృషి


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ప్రజ్ఞ, స్వాగా ప్రతినిధులు

సీతంపేట: సాంఘిక సంక్షేమ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం(స్వాగా) ప్రారంభోత్సవ సభ ఈ నెల 9న ఉదయం 10 గంటలకు రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లవరపు కైలాస్ తెలిపారు. కార్యక్రమ బ్రోచర్‌ను గీతం ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రజ్ఞ చేతుల మీదుగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకటిగా చేసి, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గురుకుల పాఠశాలల విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతి పేద విద్యార్థి గురుకులాల్లో చేరి చదువుకోవడానికి వేసవి సెలవుల్లో జ్ఞాన యాత్ర చేపట్టి ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గురుకుల సొసైటీకి, ప్రభుత్వానికి వారధిగా పనిచేసి విద్యార్థులను చైతన్యవంతంగా చేయడమే సంఘ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బి.రవికుమార్, కంచి బాల అప్పారావు, పెద్దాడ రాజు, విమల్, చైతన్య, పైల శ్రీను, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.